క్లుప్తంగా

నడిగూడెం ఎంపీడీఓగా హరిసింగ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ హరిసింగ్

నడిగూడెం : నడిగూడెం మండల ఎంపీడీఓగా గుగులోతు హరిసింగ్ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన దాసరి సంజీవయ్యకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా ఉద్యోగం రావడంతో వెళ్లారు. దీంతో నేరేడుచర్ల ఎంపీఓగా పని చేస్తున్న హరిసింగ్ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ కుమారి, సూపరింటెండెంట్ ఇమామ్ ఉన్నారు.

రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా గూడెపు దీప



హుజూర్‌నగర్ : రజక సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా హుజూర్‌నగర్‌కు చెందిన గూడెపు దీప బుధవారం నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు భిక్షపతి ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల ప్రకాష్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు దీప తెలిపారు. తన నియామకానికి సహకరించిన చిలకరాజు శ్రీను, సంఘం పెద్దలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ఎత్తిపోతల పథకం నిర్మించొద్దని వినతి

మేళ్లచెరువు : చింతలపాలెం మండలం వెల్లటూరు గ్రామ పరిధిలో కృష్ణానదిపై ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించొద్దని వెల్లటూరు గ్రామస్తులు కోరారు. ఈమేరకు బుధవారం మేళ్లచెరువు పరిధిలోని వెల్లటూరు పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామస్తులు తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ దశలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, కొంతమందికి పునరావాస ప్యాకేజీ ఇంకా రావాల్సి ఉందని, ఆ సమస్యలు పరిష్కారం కాకుండా తిరిగి లిఫ్ట్ ఏర్పాటుకు భూములు ఇవ్వాలనడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో రైతులు శివారెడ్డి, కోటిరెడ్డి, నాగరాజు, గురవయ్య, జాన్, సుందరరావు, కొండ, శ్రీను, నాగిరెడ్డి, వీరస్వామి,సైదులు, తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తానీయులపై చర్యలు తీసుకోవాలని వినతి

చిలుకూరు : మండలంలో ఎవరైన పాకిస్తానీయులు ఉంటే వారిని తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్, మండల నాయకులు మునగంటి నాగాచారి, మీసాల మట్టయ్య, కట్టెకోల వెంకన్న, కొండా శ్రీను, సతీష్, పంత్, సుదర్శన్, అనిల్, రాంబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : మంచిర్యాలలో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే న్యాయవాదుల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకుడు, ప్రముఖ న్యాయవాది చిత్రం విశ్వనాథ్ అన్నారు. బుధవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్, ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్, ప్లీడింగ్ అండ్ డ్రాఫ్టింగ్స్‌తో పాటు నూతన చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం

మునగాల : 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని మునగాల ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కారు డ్రైవింగ్ చేసేవారు తప్పకుండా సీటు బెల్టు ధరించాలని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. రామకృష్ణ సేవా సమితి సభ్యులు దేవులపల్లి సుబ్రహ్మణ్యం, త్రివిక్రమరావు, ధూళిపాళ రామకృష్ణ ప్రసాద్, నందయ్య, ఆకుల గిరిబాబు, భిక్షపతి, రామలింగయ్య, ఆశీకుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడులతో బెంబేలు

పది రోజుల్లో 40 మందిపై దాడి
- పశువులను కూడా గాయపరుస్తున్న శునకాలు
- కుక్కల బెడదను నివారించాలని ప్రజల వేడుకోలు



పట్టణంలోని రంగాథియేటర్ సెంటర్‌లో సంచరిస్తున్న కుక్కలు

కోదాడరూరల్ : కోదాడ పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శునకాలు వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, గేదెలు, ఆవులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పట్టణం, మండల పరిధిలో వారం రోజుల్లో 40 మందిపై దాడి చేశాయి. 120కి పైగా పశువులపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. మేతకు వెళ్లిన పశువులు, జీవాలపై దాడి చేసి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై గుంపులుగా తిరుగుతూ వచ్చీపోయే వారిపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ విషయం స్థానిక అధికారులకు, నాయకులకు చెప్పినా వాటిని అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అయితే కుక్కల సంఖ్య పెరగకుండా బర్త్ కంట్రోల్ సర్జరీలు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. ఇక మున్సిపాలిటీ అధికారులు అప్పుడప్పుడు కుక్కలను పట్టించి దూరంగా తరలించినా నెలరోజుల తర్వాత యాధావిధిగా వచ్చి సంచరిస్తున్నాయి.

ఒకే రోజు 15 మందిపై దాడి..

కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్, గణేష్‌నగర్, తిలక్‌నగర్, గోపిరెడ్డినగర్‌లలో వారం రోజుల క్రితం ఒకే రోజు 15 మందిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వారిలో ఖమ్మం క్రాస్ రోడ్‌లోని చిన్నారికి తీవ్రగాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆ చిన్నారి కోలుకుంటోంది. అదే రోజు అనంతగిరి మండలంలోని త్రిపురవరంలో వీధి కుక్క ఐదుగురిపై దాడి చేసి గాయపరిచింది. నాలుగు రోజుల కిందట పట్టణంలోని నయానగర్, రెడ్ చిల్లీ వెనుక వైపు ముగ్గురిపై కుక్కలు దాడి చేశాయి. రెండు రోజుల కిందట కోదాడ మండల పరిధిలోని కాపుగల్లులో పిచ్చి కుక్క ఆరుగురు వ్యక్తులపై, 72 పశువులపై దాడి చేసి గాయపరిచింది. పట్టణ శివారులోని గుడిబండ రోడ్డులో ఇతర జిల్లాల మేకలకాపరులు రాత్రి సమయంలో పొలాల్లో ఎరువుపెట్టేందుకు జీవాలను ఉంచగా కుక్కలు 15 జీవాలపై దాడి చేశాయి.

వ్యర్థాలు పారబోస్తుండడంతో..

పట్టణ, గ్రామాల శివారుల్లో వ్యర్థాలతో పాటు పశువుల కళేబరాలను పడేస్తున్నారు. వాటిని తినేందుకు కుక్కలు గుంపులుగా వస్తున్నా యి. ఆ సమయంలో అటుగా వెళ్లిన పాదచారులు, వాహనదారులపై దాడి చేస్తున్నాయి. పట్టణంలోని అంజలి స్టూడియో వీధిలో కుక్కల గుంపు ద్విచక్రవాహనదారుడి వెంట పడటంతో భయంతో అత ను కింద పడటంతో గాయాలపాలయ్యాడు. ఇలా కుక్కలు వెంటపడినప్పుడు వాహనదారులు ఆందోళనకు గురై అదుపు తప్పి కిందపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

కుక్కలను నివారించాలి



కోదాడ పట్టణంలోని వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తోన్నాయి. మహిళలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించి పట్టణంలో వీధి కుక్కలు లేకుండా పూర్తిగా నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

– బొమ్మల వెంకన్న, కోదాడ

మేలైన పశు సంతతి సంరక్షణే లక్ష్యం

- జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు



మేలైన జాతి గేదెలను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

కోదాడరూరల్ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సురభి చయాన్ శ్రంకల పథకం పశుపోషకులకు వరం లాంటిదని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ దాచేపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో సురభి చయాన్ శ్రంకల పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మేలైన పశు సంతతి సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. దేశంలో 10 నుంచి 15 లీటర్ల పాలిచ్చే పశువులను గుర్తించి వాటి జాతి, వయస్సు, ఈతలు, రోజువారి పాల దిగుబడి, వాటి తల్లులు, మేత వివరాలను భారత్ పశుధాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాలికుంటు నివారణ టీకాల వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ నెల 14లోపు టీకాల కార్యక్రమాన్ని ముగించాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కోదాడ ప్రాంతీయ పశువైద్యాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య, సిబ్బంది రాజు, సాగర్ ఉన్నారు.

‘అల్లూరి’కి ఘన నివాళి



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : ఆంగ్లేయులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని బుధవారం నేరేడుచర్లలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత రాపోలు నవీన్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సీఐటీయూ నేత నీలా రామ్మూర్తి, నాయకులు వెంకట్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, అనగంటి మీనయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కమ్యూనిస్టులపైనే దేశ భవిష్యత్



గరిడేపల్లి : రంగాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : దేశ భవిష్యత్ కమ్యూనిస్టులపై ఆధారపడి ఉందని, రానున్న రోజుల్లో ఎర్రజెండాకు పూర్వ వైభవం రావడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రంగాపురం, వెలిదండ గ్రామాల్లో తిరగమళ్ల కిరణ్, మామిడి శ్రీనివాస్‌ల అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ మహా సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటూ పేదలను విస్మరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఎర్రజెండాలు ఎగురవేశారు. ఈ మహాసభలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు పోటు పూర్ణచంద్రరావు, కడియాల అప్పయ్య, ఎడ్ల అంజిరెడ్డి, మామిడి శ్రీనివాస్, ప్రధాని సైదులు, కట్ట అశోక్, సుందరయ్య, పోటు కృష్ణబాబు, రాజా, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

అనంతగిరి : పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం తమ్మర గ్రామంలో ఏర్పాటు చేసిన అనంతగిరి మండల మూడవ మహసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం 15 మందితో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, బత్తినేని హనుమంతరావు, డేగ విరయ్య, బాణాల నాగేశ్వరరావు, వీరబాబు, నూకల శ్రీను, వాక పుల్లారెడ్డి, బాణోతు కోటేశ్వరరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా

మునగాల : పేదవర్గాలకు ఎర్రజెండా ఎల్లవేళలా అండగా ఉంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ములకలపల్లి రాములు అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని కొక్కిరేణిలో సీపీఎం గ్రామ కార్యదర్శి నందిగామ సైదులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా సీపీఎం సీనియర్ నాయకుడు దాసరి గుర్వయ్య, ములకలపల్లి సైదులు ఎర్రజెండాను ఆవిష్కరించారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, జిల్లా కమిటీ సభ్యులు మిట్టగణుపుల ముత్యాలు, వట్టెపు సైదులు, మండల కమిటీ సభ్యులు రేఖ లింగయ్య, మండవ వెంకటాద్రి, డి.స్టాలిన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాలపాటి ఎల్లమ్మ, నందిగామ రాణి,ఝాన్సీ, డీవైఎఫ్‌ఐ నాయకులు మామిడి గురుమూర్తి, ములకలపల్లి నాగరాజు, ఇంటూరి హుస్సేన్, గడ్డం తిరుపయ్య పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

మోతె : పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మేడే స్ఫూర్తితో పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. బుధవారం మోతె మండలంలోని బుర్కచర్ల గ్రామంలో నిర్వహించిన మేడే వారోత్సవాల్లో ఆయన పాల్గొని ఎర్రజెండా ఎగరవేసి మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మికులు మొత్తం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కక్కిరేని సత్యనారాయణ, రెడ్డిమల్ల ఇందిర, రాములు, కొండ రాములు, చెరుకు శ్రీను, అచ్చాలు, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో పోలీసులు మమేకం కావాలి



మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజలతో పోలీసులు మమేకం కావాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. బుధవారం మండలంలోని వేపల సింగారంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైన కేసుపై పోలీస్ రికార్డులో ఒక్కసారి పేరు నమోదైతే జీవితంలో ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం కోల్పోతారని తెలిపారు. గ్రామంలో విలేజ్ పోలీస్‌ను ఏర్పాటు చేశామని, పోలీస్‌స్టేషన్‌కు రాలేని వారు విలేజ్ పోలీసు ద్వారా తమకు సమాచారం అందించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, రాంబాబురెడ్డి, ఏఎస్‌ఐ రమేష్, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు, యువకులు, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అన్ని వసతులు

నడిగూడెం : నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నారని, విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో చేరి ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ కోరారు. ప్రభుత్వ కళాశాలలో చేరాలని ముద్రించిన కరపత్రం, బ్యానర్‌ను బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలోఆమె ఆవిష్కరించి మాట్లాడారు. 2025 ఫలితాల్లో జిల్లాలో నడిగూడెం జూనియర్ కళాశాల మొదటి స్థానంలో నిలవడం పట్ల అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.విజయనాయక్, అధ్యాపకులు జాన్ పాషా, శ్రీధర్, మహేష్, కృష్ణ, వీరన్న, వెంకటేశ్వరరావు, నాగరాజు, ఉపేందర్, మదార్, కొల్లు శ్రీనివాస్, ధనుంజయ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

చిలుకూరు : మండలంలోని నారాయణపురం, బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం గ్రామస్తులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు గండి పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు



నల్లచెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల నల్ల చెరువు, పెద్ద చెరువులకు బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు గండి పెట్టారు. దీంతో చెరువుల నీరు వృథాగా పోతోంది. చెరువుల్లోని నల్ల మట్టిని తోలుకోవడానికే గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా చెరువులకు గండి పెట్టి నీటిని బయటకు వదిలి ఉండవచ్చని గ్రామస్తులు బుధవారం తెలిపారు. వేసవికాలం దృష్ట్యా చెరువులు ఖాళీ అయితే గ్రామంలో భూగర్భ జలాలు తగ్గి బావులు, బోర్లు వట్టిపోయే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెరువుల నీరు బయటకు వెళ్లకుండా చూడాలని, గండి పెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లిదండ్రులకు సన్మానం

నడిగూడెం : పదవ తరగతి ఫలితాల్లో నడిగూడెం మండల టాపర్‌గా నిలిచిన మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్.నజీమా తల్లిదండ్రులు రఫీ, షమీమును బుధవారం పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.కరుణ, ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాసరెడ్డి, అరుణజ్యోతి, హరిత, తిరుమల, సరిత, తదితరులు పాల్గొన్నారు.

1008 బిందెలతో జలాభిషేకం



విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండలంలోని పోలేనిగూడెం గ్రామంలో శ్రీ పార్వతీసమేత భీమలింగేశ్వరస్వామి, గణపతి, విగ్రహాల స్థిర ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా బుధవారం విగ్రహాలకు భక్తులు 1008 బిందెలతో జలాభిషేకం చేశారు. గురువారం ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర

కోదాడరూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తోందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. జైబాపు, జైభీమ్, సంవిధాన్ నినాదంతో బుధవారం మండలంలోని అల్వాలపురం, దోరకుంట, చిమిర్యాల, మంగలితండాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, మండలపు శేషు, మల్లెల బ్రహ్మయ్య, గద్దల వెంకటేశ్వర్లు, కొత్త గుర్వయ్య, పత్తిపాక రామకృష్ణ, మధు, వీరబాబు, హనుమంతరావు, సురేష్ ఉన్నారు.

భారత సైనికులకు సంఘీభావంగా ర్యాలీ



హుజూర్‌నగర్ : జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

హుజూర్‌నగర్ : పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి ప్రతీకార చర్యగా ఆపరేషన్ సింధూర్ పేరుతో పాక్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై దాడి చేసిన భారత సైనికులకు సంఘీభావంగా బుధవారం హుజూర్‌నగర్‌లో పలువురు జయహో భారత్ పేరుతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మజాగరణ, విశ్వహిందూ పరిషత్, వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌పై హర్షాతిరేకాలు

మఠంపల్లి : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడికి ధీటుగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌పై మఠంపల్లిలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బుధవారం స్థానికంగా మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు భారత్‌మాతాకి జై.. వందేమాతరం, జయహో వీరసైనికులారా జయహో అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కండె వెంకటేశ్వర్లు, నాయకులు బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, కుక్కడపు కాంతారావు, వస్తెపల్లి ఆంజనేయులు, వంగవేటి పెద్ద రామారావు, చీదెళ్ల నాగ భూషణం, ముత్తా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- ఆర్డీఓ శ్రీనివాసులు



రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గరిడేపల్లి : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని కుత్బుషాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరణి పోర్టల్ ద్వారా గతంలో పరిష్కారం కాక పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. రైతులు తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలపై గ్రామ సభలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. రైతులు దరఖాస్తు అందజేసి అధికారుల నుంచి రశీదు పొందాలని సూచించారు. కార్యక్రమంలో గరిడేపల్లి తహసీల్దార్ బండ కవిత, డీఏఓ రాజేందర్ రెడ్డి, ఆర్‌ఐలు రాము, ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



మునగాల : స్వామివారికి హారతి ఇస్తున్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి శాంతికల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఎస్‌ఐ ముత్తయ్య ప్రారంభించారు. సాయంత్రం స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో పూజారి నవీన్, విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు నరసింహచారి, శ్రీనివాసచారి, కార్పెంటర్స్ సంఘం అధ్యక్షుడు జి.బ్రహ్మచారి, కార్యదర్శి ఉపేంద్రచారి, కోశాధికారి రాజశేఖర్‌చారి, నాయకులు డి.శ్రీనివాసరావు, బి.గోవిందరావు, ఆర్.శ్రీనివాసచారి, ఎస్.నరసింహాచారి, పి.సూర్యనారాయణచారి, కె.శివాచారి, సీహెచ్.హరీష్‌చారి, కె.విజయ్, ఎం.శంకర్, శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : మండల కేంద్రంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి 332వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ముత్యాల సత్యనారాయణచారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇనుగుర్తి వీరాచారి, సభ్యులు ముత్యాల కృష్ణ, ముత్యాల వెంకటేశ్వర్లు, ముత్యాల శివ, ముత్యాల ఓంకార్, జనార్దన్, బంగారపు శ్రీనివాస్, సునీత, సంధ్య, గోవిందమ్మ, సుజాత, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు



కోదాడరూరల్ : పూజలో పాల్గొన్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, తదితరులు



కోదాడ : చీరలు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

కోదాడరూరల్ : పట్టణంలోని కోదండ రామస్వామి ఆలయంలో శ్రీవాసవి కన్యాకపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం అమ్మవారిని తీరొక్క పూలతో అలంకరించారు. డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, రూరల్ సీఐ రజితారెడ్డి వేర్వేరుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యర్ర వెంకటనారాయణ జ్ఞాపకార్థం నాగుబండి వీరయ్య భద్రమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ రజితారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నాగుబండి రంగా, జ్యోతి, యర్ర భారతమ్మ, యర్ర శ్రీనివాసరావు, జ్యోతి, చంద్రశేఖర్, అనూష, వశిష్ట, గాయత్రి, విధిగ్నచారు హాసిని, పైడిమర్రి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి : మండల కేంద్రంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య మహిళలు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిమాత జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శిఘ్నేశ్వరుడి పూజ, వాసవిమాతకు అభిషేకం, శోడషోపచార పూజ, అష్టోత్తరపూజ, కుంకుమపూజ, మణిద్వీపవర్ణం పూజ నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కుక్కడపు సంధ్యారాణి, వంగవేటి భూలక్ష్మి, కొత్తా శ్యామల, వంగవేటి పద్మావతి, మహిళలు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : పట్టణంలో వాసవిమాత జయంతి వేడుకలను బుధవారం వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో వాసవిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. ప్రధాన కూడలిలో తవిడిశెట్టి రామనరసయ్య, అయిత ముత్తయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పులిహోర పంపిణీ చేశారు. వాసవి క్లబ్ క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, డిస్ట్రిక్ పీఆర్‌ఓ అరుణకుమారి, రాచకొండ శ్రీని వాస్‌రావు, శ్రీలత, కందిబండ వాసంతి, కొత్త లక్ష్మణ్, లక్ష్మీనర్సింహారావు, కృష్ణసుమంత్, వాసు, జ్యోతి, కవి, సైదయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకాపరమేశ్వరి జయంతిని బుధవారం హుజూర్‌నగర్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి క్లబ్, వాసవి, వనిత క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

కోదాడ : వాసవి కన్యాకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని రామాలయం వద్ద కోదాడ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.ఎస్.రావు, పత్తి నరేందర్, వెంపటి ప్రసాద్, వంగవేటి నాగరాజు, దేవరశెట్టి శంకర్‌రావ్, లక్ష్మణ్‌రావు, సన్నె ప్రభాకర్‌రావు, కిశోర్, బచ్చు సైదారావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మఠంపల్లి : విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

మఠంపల్లి : విద్యార్థులు వేసవి క్రీడల శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఐఆర్‌ఎస్ ఆఫీసర్, శాంతిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చందా సుధాకర్‌రెడ్డి కోరారు. సేవ్ ఎన్విరాన్‌మెంట్స్ అండ్ పబ్లిక్ స్కూల్స్, అమెరికన్ తెలుగు అసోసియేషన్‌కు చెందిన డాక్టర్ రమేష్, శీలా ఆర్థిక సహాయంతో పానుగోడుకు చెందిన శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మఠంపల్లిలోని సెయింటాన్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. పాఠశాల సుపీరియర్ సిస్టర్ రూబీ, కాన్వెంట్ సిస్టర్ మార్గరేట్, పీఈటీ ముక్కంటి, బాల్‌రెడ్డి, ప్రదీప్, బ్రహ్మరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 రోజుల పాటు నిర్వహించే వేసవి శిక్షణ ఉచిత శిబిరాన్ని బుధవారం మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

గరిడేపల్లి : గరిడేపల్లి, పానుగోడు, కీతవారిగూడెం గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం నుంచి ఈ నెల 26 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ చత్రు నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఏమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు ఎం.సువర్ణ, నర్సకుమారి, ఉపాధ్యాయులు కె.ధనమ్మ, అంబేద్కర్, ఎ.బాబు, సీఆర్పీలు రాతికింది రామకృష్ణ, ఎ.అశోక్‌కుమార్, జి. వెంకటేశ్వర్లు, వై.ఉమ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ శిక్షణ శిబిరం పరిశీలన

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని బుధవారం మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు పరిశీలించారు. ఆయన వెంట కోచ్ పల్లపు నాగేశ్వరరావు, అంజన్ ఉన్నారు.

మోతె : విద్యార్థులు సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలని ఎంఈఓ కె.గోపాల్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుమ్మగూడెం గ్రామంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపును ఆయన పరిశీలించి మాట్లాడారు. క్యాపులో విద్యార్థులకు ఆటలు, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిస్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.